# మనం ఎందుకు ప్రార్థించాలి?

హాలీ ఎల్. మూడీ

2000 వ సంవత్సరం జనవరి 28 న రాత్రి 8.15 నిమిషములప్పుడు దీనిని నేను అనుభవించాను / హాలీ ఎల్. మూడీ



మహా ధవళ సింహాసనముపై ఆసీనుడైన ప్రభువును నేను చూసాను. ఆయన ముందర చాలా మంది ప్రజలు పెద్దపెద్ద వరుసలలో నిలిచియున్నారు. కానీ వారి ముఖములు కనబడకుండుట గమనించి బహుగా ఆశ్చర్యపడితిని. వారి ముఖములు ఉండవలసిన చోట ఖాళీగా ఉన్నవి.



ఒక్కొక్క వ్యక్తి దేవుని ముందుకు వచ్చినప్పుడు, ఆయన ఒక పుస్తకము తెరచి, ఆ వ్యక్తి చేసిన వన్నిటిని చదువుచుండెను. ప్రతీఒక్కటి అందులో వ్రాయ బడి ఉండెను, ఆ పుస్తకములో నుండి మొదటి నుండి చివరి వరకు ప్రభువు చదువుచుండెను. ఈ వరుసలలో నిలువబడిన ప్రతీఒక్కరికిని ఆయన తీర్పుతీర్చి, నరక దండన విధించుచుండెను. నరక దండన విధించబడినదని ప్రభువు పలికినప్పుడెల్లా, వారు ఏడ్చుచు, కేకలువేయుచు తమకు మరియొక అవకాశము దయచేయుమని బ్రతిమాలుచుండిరి. ప్రభువు కన్నీరు కార్చుచూ

వారితో, "***మీకు అనేక అవకాశములు అనుగ్రహింపబడెను, గాని మీరు పశ్చాత్తాపపడి నాకొరకు జీవించకపోతిరి***" అని చెప్పుచుండెను. ఈ విధముగా తీర్పు తీర్చబడుచుండెను.



చివరిగా ప్రభువు నావైపు చూచి ***"నీవు ఏమియూ చేయక ఉంటివేమని? "*** అడిగెను. ఈ ప్రశ్నకు నేను తికమక పడితిని. "నేను ఏమి చేయాలని మీరు కోరుకొంటున్నారు ప్రభువా?" అని అడిగితిని. ***"ప్రార్థించు"*** అని ప్రభువు చెప్పెను. నేను ప్రార్థించుట మొదలుపెట్టితిని గానీ, అది అంత పట్టుదల కలిగినదిగా లేదు. కొంత సమయము గడచిన పిదప ప్రభువు నా వైపు కరుణతో చూచి, ***"వారిని చూడుము, జాగ్రత్తగా చూడుము"*** అని చెప్పారు. నేను వారిని చూచినప్పుడు వారి ముఖములు స్పష్టముగా కనిపించసాగాయి. కొంతమంది తెలిసినవారు, తెలియనివారు వారిలో ఉన్నారు. నేను కొంత పట్టుదలతో వారి గురించి ప్రార్థించసాగాను. మరల ప్రభువు ***"వారిని మరియొకసారి చూడుము"*** అని చెప్పారు. ఇప్పుడు ఆ ప్రజలంతా నా స్నేహితులైపోయారు. ***"ఇంకా గట్టిగా ప్రార్థించమని"*** ప్రభువు ఆదేశించారు. నేను ఇంకొంచం పట్టుదలగా ప్రార్థించసాగాను. ఇంకా ఆ పొడవాటి వరుసనుండి ఒక్కొక్కరు ప్రభువు ముందు నిలవబడుచుండగా, ఆయన వారి వారి పుస్తకములనుండి, వారివారి జీవితచరిత్ర అంతయు చదివి వారికి తీర్పు తీర్చుచుండెను.

ప్రభువు మరియొక సారి కోపముతో నావైపు చూచెను. ఆయన శిక్షింపబడిన వారి నిమిత్తమై ఇంకనూ రోదించుచుండెను. ***"ఇక్కడ జరుగుచున్న దానిని నీవు నిజముగా గ్రహించగలుగు చున్నావా?"*** అని ప్రభువు నన్ను ప్రశ్నించెను. చూచుచుండగానే, ఆ వరుసకు చివరలో ఒక భిలము (రంధ్రము) తెరువబడెను. నేను ఆ భిలమును గమనించసాగాను. అందులో నుండి దట్టమైన చీకటి వచ్చుచుండెను. అందులోనుండి మూలుగులు, కేకలు, అరుపులు, రోదనలు వినబడుచుండెను. ***"వెళ్ళి చూడు"*** అని ప్రభువు నాకాదేశించెను. కాని

నాకు చూచుటకు మనస్సులేకున్నను, ఏదో ఒక బలమైన హస్తము నన్ను ఆ భిలము అంచు వరకు తోసుకు వెళ్ళింది.



నేను ఆ నల్లటి భిలము అంచున నిలువబడి అందులోనికి చూచితిని. అందులోనికి చూచినప్పుడు, భయముతో, వణుకుతో వెనుకకు జరిగిపోతిని. ఆ చీకటి భిలము లోపలివరకు కనిపించు చుండెను. కోపముతో కంపిచుచున్న జనసమూహాము ఆ భిలము అడుగున కనబడుచుండెను. ఒకరికొకరిమధ్య ఖాళీ లేనంతగా వారు క్రిక్కిరిసి ఉండిరి. అక్కడ అగ్ని జ్వాలలు, ఎర్రని కాంతితో ఆ భిలము గుండా పైకి ఎగసి పడుచుండెను. గంధకపు వాసన వచ్చుచుండెను. అక్కడ అగ్ని జ్వాలలు కనబడుచుండెను. ఆ జ్వాలల వేడి నన్ను తాకుచుండెను. అక్కడ వారి శరీరములపై పురుగులు ప్రాకుచుండెను. వారు అగ్నిలో ఉంటిరిగానీ, వారిని ఆ అగ్ని దహించివేయుటలేదు. కానీ ఆ జ్వాలల తీవ్రతకు వారు బాదతో మూల్గుచుండిరి. వారు ఆ భిలముపైకి చూచుచుండిరి. వారి చేతులు పైకి చాపబడివున్నవి. వారు బాదతో మూల్గుచూ అలలవలే కదలుచుండిరి. వారు కృపకొరకు, విడుదల కొరకు రోదించుచుండిరి గానీ అవి వారికి అనుగ్రహింప బడలేదు.

భయముతో, నిస్పృహతో, గగుర్పాటుతో ఆ చీకటి బిలమునకు దూరముగా జరిగిపోతిని. సింహాసనాసీనుడైన ప్రభువు వైపు తిరిగితిని. ఆయన ఇంకను ఆ పుస్తకముల నుండి చదువుచుండెను. అనంతముగా పేర్చబడిన పుస్తకముల దొంతర ఆయన సింహాసనమునకు ప్రక్కన చూచితిని. ఎవరెవరికొరకు ఆ పుస్తకములు వ్రాయబడెనో వారందరు శిక్షింపబడుదురు. తీర్పు కొరకు నిరీక్షిస్తున్న అనేకమందిని అక్కడ చూచితిని. నేను వారి ముఖములను స్పష్టముగా చూడగలుగుచున్నాను. వారు నా కుటుంబ సభ్యులు, బందువులు

మరియు స్నేహితులు. వారందరు శిక్షించబడుచుండిరి. వారందరు చీకటి బిలములోనికి త్రోయబడిరి, ఆ బిలములోనికి పడిపోవుచున్నప్పుడు వారి రోదన నాకు వినబడుచుండెను.

చెంపలపైకి కారుతున్న కన్నీటితో ప్రభువు నావైపు తిరిగి ***"ఇప్పుడు ప్రార్థించు"*** అని చెప్పెను. నేను ఏడ్చుచు, మూల్గుచూ, ఈ ప్రజలపై కరుణ చూపమని ప్రార్థింపసాగాను. తీర్పు తీర్చబడి, బిలములోనికి త్రోయబడుచున్న వారిని బయటకు లాగి రక్షించుటకు ఆ బిలము అంచుకు పరిగెత్తిపోతిని. వారి చేతులు పట్టుకొని పైకి లాగుటకు ప్రయత్నించుచుంటిని గానీ వారు నా చేతుల పట్టు నుండి జారిపోవుచుండిరి. వారిని బయటకు లాగి రక్షించుటకు విఫల ప్రయత్నము చేయుచుంటిని. ఒక చేయి చాపి ప్రభువును పట్టుకొని మరియొక చేయి చాపి బిలములోనికి జారిపోవుచున్న వారిని బయటకు లాగుటకు ప్రయత్నించుచుంటిని.

***"వారిని పోనిమ్ము"*** అని ప్రభువు నాతో చెప్పెను. "వారిని పోనిచ్చిన యెడల నేను కూడా వారితో ఆ బిలములోనికి పోవుదునని" ప్రభువుతో ఎదురాడితిని. ***" వారిని పోనిమ్మని"*** ప్రభువు నాతో మరలా చెప్పెను. నన్ను ఏవో అదృశ్య హస్తాలు పట్టుకొన్నట్టుగా ఉంది. నేను ఆ బిలము దగ్గర పడి, దానిలోనికి వంగి, దానిలోనికి పడిపోవుచున్న వారిని రక్షించుటకు ప్రయత్నించుచుంటిని. నేను ఆ బిలమునుండి వస్తున్న వేడికి కాలిపోవుచున్నట్లున్నది. కొన్నిసార్లు ఏవో పంజాల వంటి చేతులు నన్ను పట్టి లాగేస్తున్నట్లు ఉండెను. నా చేతులపై కాలిన బొబ్బలు, గోటి గాట్లను కనుగొంటిని.



నేను ఏడ్చుచూ నా ప్రియమైన వారిని విడిపించమని ప్రభువును వేడుకొనుచుంటిని. నా ప్రియమైన వారిపై కరుణించి ఆ బిలము నుండి తప్పించమని ప్రాధేయపడుచుంటిని. అప్పుడు ప్రభువు ***"తప్పిపోయిన మీ ప్రియమైన వారి గురించి మొర్ర పెట్టడం నీకు సులువే కా నీ నీవు గ్రహించ వలసినది ఏమనగా, తీర్పుతీర్చబడిన వారందరూ నాకు ప్రియమైన వారే, నీవు నీ ప్రియమైన వారికొరకు ప్రార్థించుచున్న రీతిగా అందరూ తప్పిపోవుచున్న అందరికొరకు ప్రార్థించాలని నేను బహుగా ఆశించుచున్నాను. నేను***

*తప్పిపోయిన వారికొరకు మొరపెట్టు ఒక జనాంగమును లేవనెత్తెదను. వీరు పోరటమునందు గాయపరచబడినను, కాల్చబడినను, నరకపు శక్తులన్నీ వారిపై దాడిచేసినను, నేను వారితో ఉండి సంరక్షించెదను"* అని చెప్పి, *"ఇప్పుడు నీవు ప్రార్థిస్తావా?"* అని ప్రభువు నన్ను అడిగారు.

**- హాలీ ఎల్. మూడీ**

Translated to Telugu by T. J. H. Prasad Babu, prasadbabutjh@gmail.com